RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశం

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 170 విశాఖపట్నం సంపాదకులు: కె.ఎస్.రంగశాయి మంగళవారం 18-08-2026 పేజీలు :8 వెల: రూ.1-00

## ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం




**అమరావతి, ఆగస్టు 17 (నేటి మన దేశమ్) :** ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజున ఉదయం 9 గంటలకు శాసన సభ సమావేశాలు ప్రశ్నోత్త రాలతో మొదలయ్యాయి. ఉదయం 10:30 తర్వాత బ్రేక్ సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) భేటీ అయ్యింది. ఈ నెల 20 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసు కున్నారు. నేటి నుంచి 4 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.

**19న డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక :** శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవి భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ నెల 18న నామినేషన్లు స్వీకరించనున్నారు. 19న డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక ఉంటుంది. జకియా ఖానుం పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నిక చేపడుతున్నారు.

## ధైర్యముంటే సభకు రండి..

### వైకాపాకు సీఎం చంద్రబాబు సవాల్



**అమరావతి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** మెగా డీఎస్సీకి సంబంధించిన ప్రతి అంశాన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంపై కుట్రలు పన్నేవాళ్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చ రించారు. వైకాపా ఎమ్మెల్యేలకు ధైర్యముంటే దీనిపై చర్చించేందుకు శాసన సభకు రావాలని సవాల్ విసిరారు. అడిగే ప్రశ్నలకు సమాధానం చెబుతామన్నారు. శాసనసభలో సీఎం మాట్లాడారు. "విద్యను తెదేపా ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. గురుకుల పాఠశాలల విధానాన్ని ఎన్టీఆర్ తీసుకొచ్చారు. నేడు దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్ పాఠశాలలు వచ్చాయి. గతంలో రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు కూడా సరిగా ఉండేవి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాలలతో పాటు మండలానికి ఒక కళాశాల, డివిజన్‌కు ఒక ఇంజినీరింగ్ కళాశాల, జిల్లాలకు వైద్యకళాశాల ఏర్పాటు విధానాన్ని తీసుకొచ్చాం. ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో ఉన్నన్ని ఇంజినీరింగ్ కళాశాలలు దేశంలో ఎక్కడా లేవు. 1995 నుంచి 2025 వరకు 14 డీఎస్సీల్లో 11 నేనే నిర్వహించా. పాఠ తరువాయి 2లో..

## మోదీజీ..

### సింహాద్రి అప్పన్న దర్శనానికి రండి..


### అశోక్ గజపతి ఆహ్వానం



**ఢిల్లీ, ఆగస్టు 17 :** ప్రధాని నరేంద్రమోదీతో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భేటీ అయ్యారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రధానితో ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహాన్ని మోదీకి అశోక్ గజతిరాజు బహూకరించారు. సింహాద్రి అప్పన్న దర్శనానికి రావాలని ఆలయ ట్రస్ట్ తరఫున ప్రధానిని ఆయన ఆహ్వానించారు. దర్శనానికి వస్తానని మోదీ తెలిపినట్లు అశోక్ చెప్పారు. గోవాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టుల పురోగతిని ప్రధానికి ఆయన వివరించారు.

## డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించాం

### మంత్రి నారా లోకేశ్



**అమరావతి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. మెగా డీఎస్సీ-2025పై అసెంబ్లీలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించామని పేర్కొన్నారు. "ఏటా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాం. మొత్తం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో తెదేపా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలు చేసింది. టీచర్ల నియామకాలు, బదిలీలు పారదర్శకంగా ఉండాలని సీఎం భావించారు. మా ప్రభుత్వం టీచర్లను సింగపూర్, ఫిన్‌లాండ్‌లకు పంపింది. గతంలో వైకాపా ప్రభుత్వం టీచర్లను మద్యం దుకాణాల ముందు నిలబెట్టింది" అని మంత్రి లోకేశ్ అన్నారు. "ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ఉంది. వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చు. భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టుల్లో 336 కేసులు దాఖలు చేశారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు స్పష్టంగా చెప్పింది. డీఎస్సీలో ఇలాంటి రిజర్వేషన్ అమలు దేశ చరిత్రలోనే తొలిసారి. పారదర్శకంగా మేం నియామకాలు చేపట్టాం. అందుకే వేల మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందగా బయటకు వచ్చి ప్రభుత్వానికి అండగా నిలిచారు " అని లోకేశ్ అన్నారు. తరువాయి 2లో..

## ఏఈ కుటుంబం ఆత్మహత్యాయత్నం..

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: పవన్



**పిఠాపురం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** రాజ మహేంద్రవరం సమీపంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన వారిని గుర్తించి, రక్షించేందుకు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో తరువాయి 2లో..

## భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి..

### కాషాయ దళం కొత్త టీమ్ ఇదే




**అమరావతి :** భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల చేసింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్ మాధవ్ (ఢిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి (గుజరాత్), డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), సర్దార్ మన్‌ప్రీత్ సింగ్‌బాదల్ (పంజాబ్), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ప్రొఫెసర్ ఎం.నాగరాజ (కర్ణాటక), ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ (ఉత్తర్‌ప్రదేశ్), డాక్టర్ మధుచంద్ర కర్ (పశ్చిమబెంగాల్) చోటు దక్కించుకున్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్య దర్శుల్లో ఒకరిగా నియమితులై పార్టీలోని కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

**భాజపా కొత్త టీమ్ ఇదే..**

పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత): బీఎల్ సంతోష్ (ఢిల్లీ)

జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు తరువాయి 2లో..

## ఆగస్టు 30 నుంచి

### కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమం



**తిరుమల, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కారీరిష్టి యాగం (వరుణ యాగం), వరుణజపం, పర్జన్యశాంతి (ఇంద్ర యాగం) హోమాలను తితిదే నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్తపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## సెప్టెంబర్ 3 నుంచి 20 వరకు విశాఖలో ఆర్మీ నియామక ర్యాలీ

### - పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు




**విశాఖపట్నం ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** విశాఖపట్నంలో సెప్టెంబర్ 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీకి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్న ఈ నియామక ర్యాలీలో రాత పరీక్షలో అర్హత సాధించిన 10,355 మంది అభ్యర్థులు పాల్గొననున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

ర్యాలీలో భాగంగా నిర్వహించే 1.6 కిలోమీటర్ల నైట్ రన్‌ను ఆర్.కె. బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ప్రారంభించి, విక్టరీ ఎట్ సీ వార్ మెమోరియల్ వద్ద ముగించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. దీనిలో ప్రతి రోజూ 800 మంది పాల్గొంటారని, రన్ లో విజేతలుగా నిలిచిన వారికి ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మిగిలిన ప్రక్రియలు ఉంటాయని స్పష్టం చేశారు. రన్ మార్గంలో ట్రాఫిక్ తరువాయి 2లో..

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.. రాహుల్ గాంధీకి ఊరట



**ఢిల్లీ, ఆగస్టు 17 :** :ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో నివేదికను అలహాబాద్ హైకోర్టులో సమర్పించొద్దని ఈడీ, సీబీఐలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ జరిగేవరకు ముందుకు తీసుకువెళ్లొద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది. ఈ విషయం అంత తీవ్రమైనదైతే.. ఇన్నాళ్లూ దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనం వహించాయని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన భాజపా నేత దర్యాప్తు సంస్థలకు చేసిన ఫిర్యాదుపై గతంలో అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని ఈడీ, సీబీఐలను ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ.. రాహుల్ గాంధీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేసును ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది.

# ధైర్యముంటే సభకు రండి..

శాలల్లో 80 శాతం నా హయాంలో నిర్వహించిన డీఎస్సీల్లో ఎంపికైన టీచర్లే ఉన్నారు. ఒక్కరు కూడా ఎప్పుడూ అవినీతి జరిగిందని చెప్పిన సందర్భమే లేదు. ఇప్పుడు మెగా డీఎస్సీపై వైకాపా నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఎన్డీయే విశ్వసనీయతను దెబ్బతీయాలంటే మీ తరం కాదు.. ఖబడ్దార్. మేం ఏదీ దాచిపెట్టలేదు. ఆన్సర్ కీ, మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాం. ధైర్యం ఉంటే శాసనసభకు రావాలని సవాల్ విసురుతున్నా. ఇది పవిత్రమైన వేదిక.. ఇక్కడ అడిగితే మేం సమాధానం చెబుతాం. వైకాపా హిట్ అండ్ రన్ పార్టీ.. ఇక్కడికి వస్తే అడ్డంగా దొరికిపోతారు.

డీఎస్సీ అభ్యర్థులకు వారి కష్టంతో ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగాలు వచ్చిన టీచర్లు ధైర్యంగా ఉండాలి. కుట్రలను ఎదుర్కొనే శక్తి ప్రభుత్వానికి ఉంది. నేను ఈ సీటులో కూర్చున్నంత వరకు ఎవరైనా తప్పు చేస్తే అదే చివరి రోజు" అని చంద్రబాబు అన్నారు.

## డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించాం

## మంత్రి నారా లోకేశ్

**ఎక్కడైనా చర్చకు సిద్ధం.. :** "డీఎస్సీపై జగన్ టీమ్ 11 అనవసర ఆరోపణలు చేస్తోంది. కులం, మతం పేరుతో వైకాపా రాష్ట్రంలో చిచ్చు పెడుతోంది. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు సభకు రాలేదు. జగన్ అనే వ్యక్తి అంబేడ్కర్ రాజ్యాంగాన్నే ప్రశ్నిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు తీసుకువచ్చారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నాం. ప్రెస్‌మీట్లు ఎందుకు.. జగన్ సభకు ఎందుకు రాలేదు. తేదీ, సమయం ఖరారు చేయండి.. చర్చకు నేను సిద్ధం. సభలోపలనైనా.. వెలుపలనైనా.. ఎక్కడైనా నేను సిద్ధం. నేనేమీ పారిపోవట్లేదు.. మీలాగా నాపై సీబీఐ కేసులు లేవు.. బెయిల్‌పై లేను. సభకు వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నా" అని లోకేశ్ అన్నారు.

# ఏఈ కుటుంబం ఆత్మహత్యాయత్నం..

ఫోన్‌లో మాట్లాడారు. ఏఈ కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఇందులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన నుంచి బయటపడిన నూకరాజు మనుమడి ఆరోగ్య పరిస్థితి వివరాలను కూడా పవన్ అడిగి తెలుసుకున్నారు. బాలుడికి అవసరమైన వైద్య సాయం అందించి పూర్తి స్థాయిలో కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని, క్షణికావేశం, మానసిక ఒత్తిడికి లోనై ఎవరూ ప్రాణాలు తీసుకునే నిర్ణయాలు తీసుకోవద్దని పవన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బెదిరింపులు, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు తక్షణమే పోలీసులు, సంబంధిత అధికారులను సంప్ర దించి చట్టపరమైన సహాయం పొందా లన్నారు. ప్రాణం అమూల్యమైందని, సమస్య లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు.1

## భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి..

శివ్‌ప్రకాశ్ (ముంబయి), సౌదన్ సింగ్ (చండీగఢ్) జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే (మహారాష్ట్ర), సునీల్ బన్సాల్ (దిల్లీ), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), స్మృతి ఇరానీ (ఉత్తర్‌ప్రదేశ్), డా.సతీష్ పూనియా (రాజస్థాన్), గజేంద్ర పటేల్ (మధ్యప్రదేశ్), హరీష్ ద్వివేది (ఉత్తర్‌ప్రదేశ్), సంజయ్ భాటియా (హరియాణా)

జాతీయ కార్యదర్శులు: కవిత పటిదార్ (మధ్యప్రదేశ్), సురేంద్రన్ (కేరళం), డా.భోలా సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్), డా ప్రదీప్ వర్మ (ఝార్ఖండ్), జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్ (గుజరాత్), డా సందీప్ పాఠక్ (దిల్లీ), ఫాంగ్నాన్ కొన్యాక్ (నాగాలాండ్), సంగీత యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), అనిల్ ఆంటోనీ (కేరళం), డా ఎం.వెంకటేశన్ (తమిళనాడు), మనోజ్ తిగ్గ (పశ్చిమబెంగాల్), సిద్ధార్థ్ శంభు (బిహార్), డా.స్వదేశ్ సింగ్ (దిల్లీ), మృగంకా దేవ్ బర్మన్ (అస్సాం), రోహన్ గుప్తా (గుజరాత్), జయప్రకాశ్ (దిల్లీ)

జాతీయ కోశాధికారి: పీయూష్ గోయల్ (మహారాష్ట్ర)

జాతీయ సంయుక్త కోశాధికారి: రాజేశ్ మంగల్ (రాజస్థాన్)

సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి: తరుణ్ చుగ్ (పంజాబ్)

సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శి : మహేంద్ర పాండే (ఉత్తరాఖండ్)

నార్త్ ఈస్ట్ కోఆర్డినేటర్- డా సంబిత్ పాత్రా (ఒడిశా)

నార్త్ ఈస్ట్ జాయింట్ కోఆర్డినేటర్ - రాజీవ్ బబ్బర్ (దిల్లీ)

ఆల్ సెల్స్ కోఆర్డినేటర్: విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్)

ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్స్: రితురాజ్ సిన్హా (బిహార్), విష్ణువర్ధన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్)

మోర్చా ప్రెసిడెంట్స్:

యువమోర్చా: డా.హేమాంగ్ జోషి (గుజరాత్)

మహిళా మోర్చా : రూప్ కుమారి చౌధరి (ఛత్తీస్‌గఢ్)

ఓబీసీ మోర్చా : అమర్‌పాల్ మౌర్య (ఉత్తర్‌ప్రదేశ్)

కిసాన్ మోర్చా - బన్సిలాల్ గుర్జర్ (మధ్యప్రదేశ్)

ఎస్సీ మోర్చా : శివేష్ కుమార్ రామ్ (బిహార్)

ఎస్టీ మోర్చా : డా మన్నాలాల్ రావత్ (రాజస్థాన్) సోషల్ మీడియా కో-కన్వీనర్లు: ప్రీతి గాంధీ (మహారాష్ట్ర), శివానంద్ ద్వివేది (దిల్లీ), అలోక్ భట్ (ఉత్తరాఖండ్), అరుణ్ యాదవ్ (హరియాణా)మరోవైపు, త్వరలోనే కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించారు. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది.

సంస్థాగత మార్పులు చేసిన నేపథ్యంలో కొత్తవారికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తాజాగా ప్రకటించిన జాతీయ కార్యవర్గం, ఇతర ముఖ్య పదవుల్లో తెలంగాణ నుంచి ఎవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

# సెప్టెంబర్ 3 నుంచి 20 వరకు విశాఖలో ఆర్మీ నియామక ర్యాలీ

నియంత్రణ, పోలీసు బందోబస్తు, బారికేడింగ్, విద్యుత్ వెలుగులు, తాగునీరు తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. అభ్యర్థుల రాకపోకలకు అవసరమైన రవాణా సౌకర్యాలు, ర్యాలీ ప్రాంగణంలో 30 కేవీఏ జనరేటర్లు, విద్యుత్ సదుపాయం, సీసీ కెమెరాలు, పీఏ సిస్టమ్, కంప్యూటర్లు, ప్రింటర్లు, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్, వై-ఫై, ఎల్‌ఏఎన్ తదితర ఐటీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ మొబైల్ టాయిలెట్లు, కన్జర్వెన్సీ సిబ్బంది, వ్యర్థాల నిర్వహణతో పాటు అభ్యర్థులు, సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అగ్నిమాపక వాహనం, డీవాటరింగ్ పంపులు, వర్షాల నేపథ్యంలో వాటర్‌ప్రూఫ్ టెంట్లు, షామియానాలు, గ్రౌండ్ మ్యాట్లు, టార్పాలిన్లు తదితర ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఆరోగ్య భద్రత కోసం వైద్య బృందాలు, అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్.కె. బీచ్ రన్ ప్రాంతంలో తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎండ, వర్షాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులకు ఓఆర్ఎస్ ద్రావణం, గ్లూకోజ్ బిస్కెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ర్యాలీ సమయంలో అభ్యర్థులకు భోజనం, రిఫ్రెష్‌మెంట్లను సబ్సిడీ ధరలపై లేదా ఉచితంగా అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ప్రాంగణంలో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌కు అవసరమైన ఏర్పాట్లు, లాంగ్ జంప్ పిట్, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలన్నారు. ఆర్మీ నియామక ర్యాలీ విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన అన్ని ఏర్పాట్లను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కల్నల్ అమరేష్ సింగ్, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, పోలీస్, జీవీఎంసీ, స్పోర్ట్స్, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# స్ఫూర్తిగా మారిన శ్రమ... సృజనగా మారిన స్వప్నం...

## సత్యసాయి విద్యావిహార్‌లో spirit of Independence విజయగాథ





### ఒక ఆలోచన... ఒక సంకల్పం...



**విశాఖపట్నం ఆగస్టు 17 (నేటి మనదేశమ్)** స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛ మాత్రమే కాదు... లిఆలోచనల్లో స్వేచ్ఛ, జీవితంలో క్రమశిక్షణ, ప్రవర్తనలో బాధ్యత, హృదయంలో మానవత్వం, చేతుల్లో సేవాభావం, జీవనంలో సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలి ఉండటమే నిజమైన స్వాతంత్ర్యం అనే భావనను విద్యార్థుల హృదయాల్లో నాటాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన జరిగింది. ఆ ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడం సులభం కాదు. కానీ విద్యార్థులు ఆ సవాలును అవకాశంగా స్వీకరించారు. వారు చరిత్రను అధ్యయనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను తెలుసుకున్నారు. అజ్ఞాత వీరుల త్యాగాలను అన్వేషించారు. భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని అర్థం చేసుకున్నారు. స్వదేశీ ఉద్యమం నుంచి స్వరాజ్యం వరకు సాగిన ప్రస్థానాన్ని పరిశీలించారు. ఆ తర్వాత తమ ఆలోచనలకు సృజనాత్మక రూపాన్ని ఇచ్చారు.

విద్యార్థుల సృాత్మకతకు రెక్కలులి

ప్రతి ఎగ్జిబిట్ వెనుక ఒక విద్యార్థి ఆలోచన ఉంది. చర్చలు జరిగాయి. స్కెచ్‌లు వేశారు. నమూనాలు రూపొందించారు. తప్పులను సరిదిద్దారు. మళ్లీ ప్రయత్నించారు.

**"ఇంకాస్త కొత్తగా ఆలోచిద్దాం..."**

**"ఇంకాస్త అందంగా చేద్దాం..."**

**"మన సందేశం అందరికీ అర్థమయ్యేలా చేద్దాం..."**

**అంటూ విద్యార్థులు తమ సృజనాత్మకతను నిరంతరం మెరుగుపరుచుకున్నారు.**

**ఇది కేవలం ఎగ్జిబిట్స్ తయారీ కాదు---లినేర్చుకున్న జ్ఞానాన్ని సృజనగా మార్చిన అద్భుతమైన అభ్యాస ప్రయాణం.**

**ఉపాధ్యాయులు... ప్రతి అడుగులో మార్గదర్శకులు**

విద్యార్థుల వెనుక నిలిచిన ఉపాధ్యాయులు ఈ విజయగాథలో కీలక పాత్ర పోషించారు. వారు కేవలం బోధకులుగా కాకుండా లిమెంటర్లు, మార్గదర్శకులు, సహచరులు, ప్రేరణదాతలుగాలి విద్యార్థులతో కలిసి నడిచారు.

ప్రతి ఆలోచనకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ప్రాజెక్టును మెరుగుపరిచారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీశారు. ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు నిరంతర శిక్షణ, రిహార్సల్స్, సమన్వయం అందించారు.

వేదికపై కనిపించిన విద్యార్థుల ప్రతిభ వెనుక లిఉపాధ్యాయుల అంకితభావం కనిపించని శక్తిగాలి నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో లికన్వీనర్‌లి, గవర్నింగ్ బాడీ సభ్యులు కీలక పాత్ర పోషించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం మధ్య బలమైన వారధిగా నిలుస్తూ, ప్రతి దశలో అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించారు. సంకల్పాన్ని కార్యాచరణగా మార్చడంలో, ప్రతి విభాగాన్ని సమన్వయం చేయడంలో, కార్యక్రమాన్ని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లడంలో కన్వీనర్ సహకారం ఎంతో విలువైనదిగా నిలిచింది.శ్రీ సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ స్కూల్స్‌లిలి అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఈ కార్యక్రమానికి ప్రత్యేక బలాన్ని అందించింది. పిల్లలు పెద్దగా కలలు కనాలి... సృజనాత్మకంగా ఆలోచించాలి... విలువలతో ఎదగాలి... సమాజానికి సేవ చేయాలిలి అనే దృక్పథానికి ఆయన ప్రోత్సాహం మరింత బలాన్నిచ్చింది.ఒకరి ఆలోచన... మరొకరి సహకారం... ఇంకొకరి ప్రోత్సాహం... ఇలా ప్రతి ఒక్కరి కృషి ఒక గొప్ప రూపాన్ని సంతరించుకుంది.ఎఎఎ లితల్లిదండ్రులు... కనిపించని శక్తిలిఈ విజయగాథలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. పిల్లలకు అవసరమైన వస్తువులు సమకూర్చడం, వారి ఆలోచనలకు ప్రోత్సాహం ఇవ్వడం, రిహార్సల్స్‌కు సహకరించడం, చివరి నిమిషం వరకు ఉత్సాహాన్ని నిలబెట్టడం ద్వారా వారు తమ వంతు సహకారం అందించారు.లిపాఠశాలలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం... ఇంట్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం... మధ్యలో పిల్లల అపారమైన సృజనాత్మకత...లి

ఈ మూడు కలిసినప్పుడు ఒక అద్భుతం ఎలా సృష్టించబడుతుందో ఈ కార్యక్రమం నిరూపించింది.

ఎగ్జిబిషన్ నుంచి వేదిక వరకు... : కేవలం ప్రదర్శనతో ఆగిపోలేదు. లి300 మందికి పైగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలులి ఈ వేడుకకు మరింత వైభవాన్ని చేకూర్చాయి.దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు, నుక్కడ్ నాటక్, చారిత్రక మరియు విలువాధారిత ప్రదర్శనల ద్వారా విద్యార్థులు లిభారతదేశ గౌరవం, వైవిధ్యం, ఐక్యత, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి భావనలిను అద్భుతంగా ఆవిష్కరించారు.

వేదికపై కనిపించిన ప్రతి నిమిషం వెనుక ఎన్నో గంటల రిహార్సల్స్ ఉన్నాయి. ప్రతి అడుగులో క్రమశిక్షణ, ప్రతి కదలికలో సమన్వయం, ప్రతి పాటలో భావోద్వేగం, ప్రతి ప్రదర్శనలో దేశభక్తి కనిపించాయి.

లిచివరికి... శ్రమ సృజనగా మారింది!లి

ఆగస్టు 15న ప్రదర్శన ప్రారంభమైనప్పుడు ఎన్నో రోజుల కష్టం అందరి కళ్లముందు అద్భుతమైన రూపంలో నిలిచింది.

**170కి పైగా ఎగ్జిబిట్స్...**

**500 మందికి పైగా విద్యార్థుల సృజనాత్మక ప్రతిభ...**

**300 మందికి పైగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు...లిలి**

**స్వర్ణ భారతం నుంచి భారతీయ ప్రతిఘటనోద్యమ ప్రస్థానం వరకు...**

**జాతీయ చైతన్యోదయం నుంచి స్వదేశీ నుంచి స్వరాజ్యం వరకు...**

అజ్ఞాత స్వాతంత్ర్య సమర వీరుల నుంచి స్వాతంత్ర్య ప్రకటన వరకు...

స్వాతంత్ర్యానికి నిజమైన నిర్వచనం నుంచి ఆధ్యాత్మిక స్వేచ్ఛ వైపు పయనం వరకు...విలువల విద్యతో అంతరంగ పరివర్తన నుంచి నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి సాకారం వరకు... విద్యార్థులు భారతదేశ లిచరిత్ర, సంస్కృతి, వారసత్వం, విలువలనులి తమదైన సృజనాత్మక భాషలో ఆవిష్కరించారు.

ప్రశంసలతో పొంగిపోయిన చిన్నారుల హృదయాలు...

గౌరవనీయ ఎంపీ ఎం. శ్రీభరత్ ప్రదర్శనను సందర్శించి విద్యార్థుల కృషి, సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసించినప్పుడు, ఆ మాటలు వారికి కేవలం ప్రశంసలు కాదు-లిఎన్నో రోజుల శ్రమకు లభించిన గొప్ప గుర్తింపు.లి

విద్యార్థులతో ఆయన జరిపిన ఆత్మీయ, స్ఫూర్తిదాయక సంభాషణ వారికి కొత్త ఆత్మవిశ్వాస్నా అందించింది.

అన్నింటికంటే మించి... భగవాన్ వారి దివ్య అనుగ్రహం

ఈ మహత్తర కార్యక్రమం వెనుక పనిచేసిన ప్రతి ఒక్కరికీ---లివిద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, కన్వీనర్, గవర్నింగ్ బాడీ, తల్లిదండ్రులులి---భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులు, అనుగ్రహం ఎల్లవేళలా మార్గదర్శకంగా, రక్షణ కవచంగా నిలిచాయని ప్రతి ఒక్కరి హృదయంలో గాఢమైన విశ్వాసం.

**ప్రతి ఆలోచనకు దిశనిచ్చింది ఆ దివ్య అనుగ్రహమే...**

**ప్రతి అడుగుకు బలాన్నిచ్చింది ఆ దివ్య ఆశీస్సులే...**

**ప్రతి సవాలును అధిగమించే ధైర్యాన్ని ఇచ్చింది ఆ దివ్య స్ఫూర్తే...**

భగవాన్ వారి దివ్య కృప, ఆశీస్సులతోనే ఈ సమిష్టి కృషి ఇంత అద్భుతమైన విజయంగా రూపుదిద్దుకుందని ప్రతి ఒక్కరి విశ్వాసం.

అందుకే ఇది కేవలం ఒక ప్రదర్శన కాదు.

ఇది పిల్లల ప్రతిభకు ప్రతిరూపం.

అన్నింటికంటే...భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో వికసించిన ఒక మహత్తర సృజనాత్మక యజ్ఞం.

**స్వప్నం ఆలోచనగా మారింది... ఆలోచన శ్రమగా మారింది...**

**శ్రమ సృజనగా మారింది... సృజన ఆత్మవిశ్వాసంగా మారింది...**

**ఆత్మవిశ్వాసం ప్రదర్శనగా మారింది...**

పిల్లలు స్వాతంత్ర్యాన్ని కేవలం జరుపుకోలేదు... దాని నిజమైన అర్థాన్ని తెలుసుకున్నారు, అనుభవించారు, ఆవిష్కరించారు.

# గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు

## ఉత్తర్వులు జారీచేసిన ఎపి ప్రభుత్వం



**అమరావతి, ఆగస్ట్ 17 :** ఏపీ గ్రీనింగ్, 'రీఫారెస్టేషన్' (పునరటవీకరణ) కార్యక్రమాల నిర్వ హణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నంబర్ -93 ద్వారా ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం, అడవుల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ఆయా కార్యక్రమాలను అమలు చేయనుంది. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో ఫారెస్ట్, ట్రీ కవర్‌ను 2047 నాటికి 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ఏపీ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఏపీ గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీ, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల పాలక మండళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర గ్రీన్ లక్ష్యాల అమలు, సమన్వయం, పర్యవేక్షణలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొణిదెల నాగేంద్రబాబును నియమించిన ఏపీ సర్కార్.. ఆయనకు కేబినెట్ హోదా కల్పించింది. ఈ నిబంధనలకు లోబడి కేబినెట్ ర్యాంక్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాల సమర్థవంతంగా అమలు చేయాలని ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది.


**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)**

Truhome FINANCE

రిజిష్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, ఆల్వార్ పేట,తేనంపేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, వాకర్ట్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051,వెబ్‌సైట్: http://www.truhomefinance.in

**లాంఛనప్రాయ స్వాధీనత నోటీస్**

ఈ క్రింద పేర్కొన్న ట్రూహూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) అధీకృత అధికారి గారు సెక్యూరిటీకరణ మరియు ఆర్థిక ఆస్తులు పునర్నిర్మాణం మరియు భద్రతా వడ్డీ చట్టం, 2002 (పేర్కొన్న చట్టం) మరియు సదరు చట్టంలో ఇవ్వబడిన సెక్షన్ 13(12)లోని అధికారాలతో నియమం 3 సెక్యూరిటీవడ్డీ (ఎన్‌ఫోర్స్మెంట్) చట్టం 2002లో పేర్కొన్న నియమాలను అనుసరించి, ఈ క్రింద పట్టికలో ఉదహరించిన రుణగ్రహీతలకు రుణంతిరిగి చెల్లించుట కొరకు డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఆ తరువాత రుణగ్రహీతలు రుణం చెల్లించుటలో విఫలమైనారు, కావున రుణ గ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) రూలు 8 పేర్కొన్న చట్టం ప్రకారము ఈ దిగువ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) సంతకందారు తేది 13-08-2026న దిగువ వివరించిన తనఖా ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీన పరచుకున్నారు. ఈ నోటీసు ద్వారా రుణగ్రహీతలకు, సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) కంపెనీ వారు స్వాధీన పరుచుకున్న దిగువ పేర్కొన్న స్థిర ఆస్తిని యేవిధమైన లావాదేవీలు చేసిన యెడల కంపెనీకి కట్టవలసిన బాకీ మరియు వడ్డీకి లోబడి ఉండును. చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి నిర్ణీత సమయాన్ని రుణగ్రహీతల దృష్టికి తీసుకురావటమైనది.

**రుణగ్రహీత పేరు మరియు చిరునామా**

శ్రీ కొరపు కొండలరావు, తండ్రి: శ్రీ కొప్పరపు శివయ్య , శ్రీమతి కొరపు చంద్రకళ, భర్త: కొరపు కొండలరావు , డోర్ నెం. 10-1063/A, టీచర్స్ కాలనీ, ఏపీజీబీ బ్యాంక్ సమీపంలో, ప్రొద్దుటూరు, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా – 516360.

**డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం**

డిమాండ్ నోటీసు తేదీ - 13.05.2026 డిమాండ్ నోటీసు : 31-05-2026 నాటికి రూ.4856204/- (నలభై ఎనిమిది లక్షల యాభై ఆరు వేల రెండు వందల నాలుగు మాత్రమే) మొత్తానికి సంబంధించిన లోన్ ఖాతా నెం. SHLHTRPT0000723

**తాకట్టు పెట్టిన ఆస్తి వివరణ**

వై.ఎస్.ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు ఉప జిల్లా, ప్రొద్దుటూరు, కొత్తపల్లి పంచాయతీ, వార్డు నెం.10 జేమ్స్‌పేట వీధి, మోదమిదపాలి గ్రామం, ప్లాట్ నెం.7 ఆర్.సి.సి. మహది మిద్ద హౌస్ సర్వే నెం. 215 మరియు 216/బి లో ఉన్న, ఇంకా కేటాయించబడని కొత్తగా నిర్మించిన డి.నెం. నివాస భవనం.కింది సరిహద్దులు: తూర్పు: రాస్తా ద్వారా 20 అడుగులు, పడమర: ప్లాట్ నెం.9 స్థలం, దక్షిణం: ప్లాట్ నెం. 8 స్థలం, ఉత్తరం: ఉమ్మడి రాస్తా ద్వారా 20 అడుగులు. షెడ్యూల్ (రిజిస్టర్డ్ సేల్ డీడ్ తేదీ 12.04.2021 ప్రకారం) కొలతలు

స్థలం: ప్రొద్దుటూరు
తేదీ: 13-08-2026

సం|| అధీకృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## నేటి మనదేశం సంపాదకీయం

### సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి !

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్దిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హార్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్ర తదితర ఉత్పత్తులపైనా ఆన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడు తోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో-గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప÷-లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు-గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో-గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి

వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్-సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గ తుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

### బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట ఏడుగురు భక్తుల దుర్మరణం

**పాట్నా, ఆగస్ట్ 17 :** బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిస లాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణ మాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అంది స్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేసి ఆర్ఇసిఎస్ జెఎల్ఎం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ తక్షణమే అమలు చేయాలి

## ఏపీఈపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్‌కు ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (హెచ్-64), ఏఐటియుసి వినతి



**విజయవాడ, ఆగస్టు 16 (నేటి మనదేశమ్) :** చిపురుపల్లి రూరల్ ఎలక్ట్రిక్ కో-ఆపరేటివ్ సొసైటీ పరిధిలో 2021 నోటిఫికేషన్ ద్వారా లిజూనియర్ లైన్‌మెన్ లుగా విధులు నిర్వహిస్తున్న 55 మంది ఉద్యోగులకు, APEPDCLలో సమాన హోదాలో పనిచేస్తున్న జీవీ ఉద్యోగులతో సమానంగా Minimum Time Scale (MTS) తక్షణమే అమలు చేసి న్యాయం చేయాలని ఏపీ ఎల క్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (H-64), =ాంఖజ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కే. మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు APEPDCL జవీణ పృథ్వీతేజ్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. జూణజూ కంపెనీ కార్యదర్శి చిరంజీవి గారికి కూడా వినతిపత్రం అందించి, సమస్యను తక్షణమే పరిష్కరిం చాలని కోరారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ, =జుజూ పరిధిలో JLMలుగా పనిచేస్తున్న ఉద్యోగులు APEPDCLలోని జీవీ ఉద్యోగులతో సమానమైన విధులు, బాధ్యతలు నిర్వహి స్తున్నప్పటికీ వేతనాల్లో వ్యత్యాసం కొనసాగడం అన్యాయమని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, విద్యుత్ ఉన్నతాధికారులకు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఉద్యోగులు విధిలేని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. ఈ అంశాన్ని పరిశీలించిన గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, APEPDCLలో పనిచేస్తున్న జీవీ ఉద్యోగులతో సమానమైన విధులు నిర్వహిస్తున్న =జుజూ ఉద్యోగులకు Minimum Time Scale అమలు చేసే అంశాన్ని పరిశీ లించాలని విద్యుత్ యాజ మాన్యాన్ని, APEPDCLను ఆదేశించిన విషయాన్ని యూనియన్ నాయకులు గుర్తు చేశారు. హైకోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నందున, వాటిని కేవలం పరిశీలన పేరుతో కాలయాపన చేయకుండా, తక్షణమే తగిన నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయాలని వారు కోరారు. సమాన పనికి సమాన వేతనం అనే న్యాయ సూత్రానికి అనుగుణంగా, RECS మరియు APEPDCLలో సమాన విధులు నిర్వహిస్తున్న జీవీ ఉద్యోగుల మధ్య ఉన్న వేతన వ్యత్యాసాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల అమలులో ఎటువంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, 55 మంది =జుజూ జీవీ ఉద్యోగులకు న్యాయం జరిగేలా తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని APEPDజూ జవీణను యూనియన్ నాయ కులు విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాల అమలులో జాప్యం కొనసాగితే, ఉద్యో గులకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య బద్ధమైన, న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగిస్తామని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (H-64), AITUC నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. సుధీర్ బాబు, రాష్ట్ర కోశాధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధన నైపుణ్యాలను కలిగి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

## ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు అవంతి శ్రీనివాసరావు దిశానిర్దేశం



**భీముని పట్నం ఆగస్టు 17 నేటి మనదేశమ్ :**
తగరపువలస, స్థానిక అవంతి ఇంజనీరింగ్ ఆటానమస్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు సోమవారం ఒరింటేషన్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని అవంతి విద్యాసంస్థల చైర్మన్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు కార్యక్రమానికి విచ్చేసిన అతిధులతో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. అవంతి శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అవంతి కళాశాలలో ఇంజనీరింగ్ లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ముందుగా హార్థికశుభా కాంక్షలు, మీఆలోచనలు నూతనంగా, అద్భుత మైన విధంగా ఉండాలని, ప్రస్తుత సమాజములో మంచి గుర్తింపు కలిగిఉండాలని హితవుపలికారు. విద్యార్థిదశ అనేది చాలాకీలకం, మీరు సమాజంలో మంచి చెడులను గుర్తించి మంచి భవిష్యత్ ను నిర్మించుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు కూడా మీ పిల్లలు యొక్క ప్రవర్తన, నడవడిక మీద దృష్టిపెట్టాలని చెప్పారు. టైమ్ మేనేజ్మెంట్, కెరీర్ ప్లానింగ్, ప్రాజెక్ట్స్ పైన దృష్టిపెట్టాలని చెప్పారు. మీరు ఎంచుకొనే రంగంలో ఉన్నతమైన నైపుణ్యం, నూతన ఆలోచనలు కలిగి ఉండాలని హితవుపలికారు. డాక్టర్ అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద యువతకి మార్గనిర్దేశికులు. గౌరవ అతిథిగా కల్నల్ నీరజ్ కుమార్, కమాండింగ్ ఆఫీసర్, ఆంధ్ర బెటాలియన్ ఎన్.సి.సి. మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎన్నో ఉద్యోగావ కాశములు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలంటే మంచినైపుణ్యం, అంకితభావం, కష్టపడేగుణము కలిగి ఉండాలి అప్పుడే మీకు ఏదైనా సాధ్యమవుతుందని చెప్పారు. మీరు చదువుకున్న కాలేజీలో గురువులను గౌరవిస్తూ తోటి స్నేహి తులతో మర్యాద, స్నేహ పూర్వకంగా మెలగాలని సూచించారు. ఈరోజు నుండే మీరు ప్రణాళిక వేసుకొని మీరు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. మరో గౌరవ అతిథిగా సుంకరి నాయుడు, ఫౌండర్ అండ్ సీఈవో, స్కిమాక్స్ ఐటి కంపెనీ, విశాఖపట్నం మాట్లా డుతూ ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యా ర్థులకు సూచనలిస్తూ మీరు ప్రస్తుత ప్రపంచంలో ఉద్యోగం సాధించాలి అంటే కమ్యూనికేషన్ స్కిల్స్ పైన, టెక్నికల్ స్కిల్స్ పైన, పైథాన్, జావా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కోర్సులు మీద అవగాహన కలగి ఉండాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచంలో ఉద్యోగావకాశములు కలిగి ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈకార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా బ్రహ్మకుమారీస్ సిస్టర్ మాధురి మాట్లాడుతూ మీరు మొదటిరోజు నుండి ప్రణాళిక వేసుకొని చక్కగా ఏరోజు చెప్పిన సబ్జెక్టలను ఆరోజునే మీరు అవలంపు చేసుకుంటే మీకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. కష్టపడేతత్వాన్ని మీరు అలవాటుచేసుకోవాలి. మీ జీవితంలో ధ్యానం, యోగ అనేవి చాలాముఖ్యం. మానసిక, శారీరక ఆరోగ్యం చాలా ముఖ్యం. నేను చాలా శక్తిని కలిగి వున్నాను ఏదైనా సాధించగలను అనే ధైర్యం కలిగి ఉండాలని చెప్పారు. అవంతి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రియాంక, మాట్లాడుతూ మీరు భవిష్యత్తులో నైపుణ్యం కలిగి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాక్షించారు. మీ ఉజ్వల భవిష్యత్ కు అవంతి కళాశాల భరోసా కల్పిస్తుందని చెప్పారు. డైరెక్టర్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్, మాట్లాడుతూ మీలక్ష్యాలను ఉన్నతగా ఉండాలి, అలాగే మీ మీద నమ్మకముతో నేను ఏదైనా సాధించాలి అనే దృఢ సంకల్పం కలిగి ఉండాలని ప్రథమ సంవత్సరములో జాయిన్ అయిన విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. తల్లి దండ్రులు కూడా మీపిల్లలు మీద శ్రద్ధపెట్టివాళ్ళు ఏలా చదువుతున్నారు అనేది పర్యవేక్షణ కలిగి ఉండాలని తల్లిదండ్రులకు విన్నవించారు. అలాగే ప్రిన్సిపాల్ డా. మురళీ కృష్ణ, మాట్లాడుతూ విద్యార్థులు ఉద్దేశించి ఎవరైతే క్రమశిక్షణ కలిగి, పట్టుదలకలిగి, ఏకాగ్రతతోసబ్జక్ట్స్ పైన అవగాహన కలిగి ఉంటారో వాళ్ళు తప్పనిసరిగా లక్ష్యం చేరుకోగలరు. ప్రతి విద్యార్థి తను ఎంచుకున్న బ్రాంచ్ లో నైపుణ్యత కలగి క్రొత్త, క్రొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు కలిగిఉండాలని ఆకాక్షించారు. డా. గండి సత్యనారాయణ, డిన్ అకాడమిక్స్ మాట్లాడుతూ ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఉండేటట్టు సిలబస్లను రూపొందించడం జరిగింది. మీరు మీలక్ష్యాన్ని నిర్దేశించుకొని చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తు నిర్మించు కోవాలని విద్యార్థులకు సూచించారు, ఈకార్యక్రమములో బేసిక్ సైన్స్ అండ్ హుమానిటీస్ విభాగాధిపతి జె.ఆర్.జి. పట్నాయక్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, భోదన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




# అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్ 10 బాటిల్స్ స్వాధీనం



**భీమునిపట్నం ఆగస్టు 17 నేటి మనదేశమ్ :**
భీమునిపట్నం మండలం మజ్జివలస గ్రామం, రాసాపోలమ్మ గుడి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో మజ్జివలస గ్రామానికి చెందిన నీలాపు అప్పారావు ను అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుండి 10 మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు.ప్రజారోగ్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని సి.ఐ హెచ్చరించారు. అక్రమ మద్యం అమ్మకాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# మత్స్యకారులకు రాజకీయ ప్రాతినిధ్యం

## - సమస్యలపై అవగాహన సదస్సు




**విశాఖపట్నం ఆగస్టు 17 నేటి మనదేశమ్ :** జాతీయ మత్స్య కార సంఘం గౌరవ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వ ర్యంలో విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో మత్స్యకారుల సమస్యలు, హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ డాక్టర్ చోడిపిల్లి సుదాకర్ హాజరయ్యారు. ప్రొఫెసర్ చెంబూరి వెంకటరావు, వాసుపల్లి నాగరాజు, అర్జిల్లి దాస్ తదితరులు పాల్గొన్నారు.

**సదస్సులో ప్రధాన డిమాండ్లు**

రాష్ట్రంలోని సుమారు 280 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను ఆధునీకరించి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి.

ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం, అభివృద్ధిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. PMMSY నిధులు పూర్తిగా మత్స్యకారులకే చేరేలా పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. మత్స్యకారుల కోసం కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే ఊరుకునేది లేదని వాసుపల్లి జానకిరామ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మత్స్యకారుల ఇన్సూరెన్స్, ఫిషింగ్ బోట్ ఇన్సూరెన్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి. మత్స్యకార ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు బీమా, పరిహారం సకాలంలో అందించాలి. మత్స్యకార యువత కోసం ప్రత్యేక సబ్సిడీ, స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలి. స్థానిక సంస్థల నుంచి శాసనసభ వరకు మత్స్యకారులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మత్స్యకారులకు సుమారు 15 స్థానాలు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. విశాఖపట్నం మేయర్ పదవిని మత్స్యకారులకు కేటాయించాలని కోరారు. సముద్రం, తీర ప్రాంతాలపై మత్స్యకారుల సంప్రదాయ హక్కులను రక్షించేందుకు ప్రత్యేక చట్టం రూపొందించాలి. మత్స్యకారుల హక్కులపై ప్రత్యేక డ్రాఫ్ట్ నిబంధనలను రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలకు అందజేస్తామని తెలిపారు.

# పెద్ద కృష్ణారాజాపురంలో రీసర్వే కార్యక్రమం ప్రారంభం



**వేపాడ మండలం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** పెద్ద కృష్ణారాజాపురం గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. సర్వేయర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని భూముల రీసర్వే ప్రక్రియను చేపట్టారు. రీసర్వేలో భాగంగా భూముల వివరాలు, హద్దులు, విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. భూ రికార్డులను మరింత ఖచ్చితంగా రూపొం దించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముమ్ములూరి జగ్గిబాబు, పరవాడ జగదీష్, త్రినాధరావు, వెంకటలక్ష్మి, గొల్లు అప్పలనాయుడు, మంగమ్మ, శ్రీరాం, బొడ్డు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు రీసర్వే సిబ్బందికి సహకరించారు.

# ఏపీ బీజేపీ కార్యవర్గ సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్



**విశాఖపట్నం, ఆగస్టు 17 ( నేటి మనదేశమ్) :** ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యవర్గ సమావేశం రేపు జరగనున్న వైజాగ్ కన్వెన్షన్ హాల్‌ను, సమావేశ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ పరిశీలించారు. కార్యవర్గ సమావేశానికి హాజరయ్యే జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు మరియు కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. సమావేశ వేదిక, పార్కింగ్, నాయకుల రాకపోకలు, సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత నాయకులు, నిర్వాహకులతో పీవీయన్ మాధవ్ చర్చించారు. సమావేశం విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి అంశంలోనూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలు తదితర కీలక అంశాలపై చర్చించేందుకు ముఖ్యమైన వేదికగా నిలవనున్న నేపథ్యంలో, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు పీవీయన్ మాధవ్ సూచించారు. ఈ సంద ర్భంగా సమావేశం నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై పార్టీ నాయకులకు ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. తొలిసారిగా విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నకు ముఖ్యఅతిధిగా జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ పాల్గొంటున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా మాధవ్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి ఏర్పాటు చేసిన విభాగాలు తో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాధవ్ అనేక సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రమేష్ నాయుడు, దయాకర్, లక్ష్మి ప్రసన్న , మీడియా ఇన్ చార్జ్ కిలారి దిలీప్, జయప్రకాష్, ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, వినోద్ వర్మ, రొంగలి గోపీ శ్రీనివాస్, పరశురాం రాజు, సురేంద్ర మోహన్ , పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గాలిని శుద్ధి చేసే మొక్కలను పెంచండి



- ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచండి.
- మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచాలి
- ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో

**విశాఖపట్నం, ఆగస్టు 17 ( నేటి మనదేశమ్) :** గాలిని శుద్ధి చేసే మొక్కలను పెంచండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మద్రి పాలెం లో ప్రతిభ మోడల్ స్కూల్ విద్యా సంస్థ శ్రీనివాస్ అధ్యక్షతన మిద్దె తోటలు పెంచుతున్న ప్రకృతి ప్రేమికులు జమీర్ విద్యార్థులకు ఈ కార్యక్రమంలో గాలిని శుద్ధి చేసే మొక్కలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి వేడెక్కుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి అని కోరారు. ప్రతి విద్యార్థికీ పర్యావరణం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం విద్యా సంస్థల మీద ఉందన్నారు. మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచాలని కోరారు. అంతేకాక ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలని, నిరంతరం పర్యావరణం గురించి కుటుంబీకులతో మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజయ్, శ్రీనివాస్, అకౌంటెంట్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 20న జరుగు బహిరంగ సభకు డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలి రండి : జి.వామనమూర్తి పిలుపు




**విశాఖపట్నం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** ఆగస్టు 20న జరుగు బహిరంగ సభకు డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలి రండి జి వామన మూర్తి పిలుపు డ్రైవర్లకు పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తేదీ 17- 8- 2026 ఉదయం 10 గంటలకి ద్వారకా నగర్ బుద్దిన పార్క్ జంక్షన్ లో డ్రైవర్ల నిరసన కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో డీజీలు పెట్రోలు వంట గ్యాస్ నిత్యవసర వస్తువుల తగ్గిస్తామని సంవత్సరానికి రెండు కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి 12,000 గడిచిన ఒక హామీ అమలు చేయలేదని మండిపడ్డారు పెంచిన ధరల వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డ్రైవర్లకు పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్తో కూడిన సంక్షేమ బోర్డు చేస్తామని జీవో నెంబర్ 21 31 రద్దు చేస్తామని వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇస్తాము ప్రమాద వ్యక్తిగత బీమా పాలసీ అమలు చేస్తామని హామీ 2000 గడిచిన చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణం అన్నారు రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీల వెంటనే అమలు చేయాలని ఆగస్టు 21 విశాఖలో జరుగు రాష్ట్ర 4 వ మహాసభలను జయప్రదం చేయాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు 20-8-2026 లక్ష్మి వారం 9:30 కి జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డ్రైవర్ పెద్ద సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు ఓలా ఉబర్ రాపిడో శ్రీ శక్తి పథకం వల్ల ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు ప్రభుత్వం నెలకి 10000 రూపాయలు జీవన భృతి ఇవ్వాలని 2026 వాహన మిత్ర వెంటనే విడుదల చేయాలని 2026 ఆగస్టు 20- 21 న విశాఖలో జరుగు రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ 20- 8- 2026 లక్ష్మివారం ఉదయం 9:30 కి ఆర్టీసీ కాంప్లెక్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగు బహిరంగ సభకు ఆటో మరియు వ్యానులు స్టాండ్లనుండి డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమములో స్టాండ్ అధ్యక్షులు యు శివాజీ రావి కృష్ణ కే రాజు ఏ నర్సింగ్ పి మహేష్ ఎం రాజు శ్రీనివాసరావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి 41 వినతులు



**విశాఖపట్నం, ఆగస్టు 17 ( నేటి మనదేశమ్) ::** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 41 వినతులు అందాయి. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా లో-వోల్టేజ్, విద్యుత్ బిల్లులు, లైన్ షిఫ్టింగ్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, రూఫ్‌టాప్ సోలార్, కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన ఫిర్యాదులు మరియు వినతులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతులను సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగ దారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా 94936 81912 వాట్సాప్ నంబర్‌కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ టి.వి.సూర్యప్రకాష్, సీజీఎం పి.సోల్మన్ రాజు, జనరల్ మేనేజర్లు ఎం.ఝాన్సీ, వి.వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్, వి.వి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సాలూరులో విషాదం..! స్కూల్ గోడ కూలి బాలుడు మృతి..!

**పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో విషాదం...**

ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ కూలిన ఘటనలో పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు.

సాలూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రౌండ్‌కు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అదే సమయంలో ప్రహరీ గోడపై కూర్చున్న విద్యార్థులపై ఒక్కసారిగా గోడ కూలడంతో... తుపాకుల అరుణ్ తేజ తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర గాయాలతో బాలుడిని ఆసుపత్రికి తరలించినప్పటికీ... చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. మృతుడు సాలూరు రెల్లి వీధికి చెందిన అరుణ్ తేజగా తెలుస్తోంది. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో పాఠశాలలో విషాదం నెలకొంది. అరుణ్ తేజ మృతితో అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. అటు బాలుడి మృతితో రెల్లి వీధిలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

**అసలు ఈ ప్రమాదానికి కారణం ఏంటి? ప్రహరీ గోడ ఎందుకు కూలింది?**

**గోడ నిర్మాణ పరిస్థితి ఎలా ఉంది? ఇలాంటి ప్రశ్నలపై అధికారులు ఆరా తీస్తున్నారు.**

## ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీ



**గొలుగొండ, ఆగస్టు 17 నేటి మనదేశమ్ :** ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొలు గొండ మండల ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు జోగుంపేట జంక్షన్ నుంచి మండల కేంద్రం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సఖి రెడ్డి నానాజీ జెండా ఊపి ప్రారంభించారు ర్యాలీ అనంతరం మండల కేంద్రం లో మొక్కలు నాటే కార్య క్రమాన్ని ప్రత్యేక ఆహ్వా నితులు ఎంపీడీవో ఉల బాల శ్రీనివాసరావు చేతుల మీదుగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అధిక సభ్యత్వం తో బలమైన జర్నలిస్టుల యూనియన్‌గా ఏపీయూడబ్ల్యూజే కొన సాగుతోందన్నారు జర్న లిస్టుల హక్కుల సాధన కోసం యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని, భవిష్యత్తులోనూ జర్న లిస్టులకు వెన్నుదన్నుగా నిలిచి హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుతామని తెలిపారు ఈ కార్యక్రమం లో సీనియర్ పాత్రికేయులు మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగంపల్లి చిన్నయ్యనాయుడు,జిల్లా ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు భీమిరెడ్డి సత్య నారాయణ పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**భీమునిపట్నం నేటి మనదేశమ్ :** సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో ఉత్సాహంగా, దేశభక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ ఐ గౌరి , పారిష్ పూజారి రెవ. ఫాదర్ రాజేంద్ర , సుపీరియర్ సిస్టర్ సవిత , ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్ జోస్ , వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మేబుల్ పాల్గొన్నారు విద్యార్థులు దేశభక్తి గీతాలు, యోగా, పిరమిడ్, ఏరోబిక్స్, ప్రసంగాలు మరియు సాంస్కృతిక కార్య క్రమాలను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. వారి అద్భుతమైన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా విద్యార్థులు అతిథులకు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తితో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐక్యత మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మరియు ఇతర గౌరవ అతిథులు విద్యార్థులను అభినందిస్తూ, ఐక్యత, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత మరియు దేశభక్తి వంటి విలువలను పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు.

## ఏయూ విద్యార్థులకు ఫార్ములా-1 రేసింగ్ కారును సమీపంగా వీక్షించే అరుదైన అవకాశం




**ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఆగస్టు 17 నేటి మనదేశమ్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఫార్ములా-1 రేసింగ్ కారు సమీపంగా వీక్షించే అరుదైన అవకాశం లభించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ఆర్‌బీ14 (RB14) ఫార్ములా-1 రేసింగ్ కారు ఎక్స్‌పోను ఈ నెల 20న నిర్వహించనున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఏ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వెంకట సుబ్బయ్య సోమవారం ఆర్‌బీ14 ఫార్ములా-1 రేసింగ్ కారు ఎక్స్‌పో పోస్టర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో ఏయూ యునైటెడ్ స్టూడెంట్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.ఏయూ యునైటెడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఎక్స్‌పో ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయ బాస్కెట్‌బాల్ కోర్టులో జరగనుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఫార్ములా-1 రేసింగ్ కారును అత్యంత సమీపం నుంచి వీక్షించడంతో పాటు, దాని ప్రత్యేకతలు మరియు రేసింగ్ ప్రపంచం లోని సాంకేతికతను ప్రత్యక్షంగా తెలుసు కోవచ్చు. క్లబ్ నిర్వాహకులు అక్షయ్, యశ్వంత్, రవికాంత్‌లు ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయ విద్యార్థులందరినీ ఆహ్వా నించారు.

## మొదటిరోజు విజయవంతంగా రిలే నిరాహార దీక్షలు హాజరయిన 155 కార్మికులు



**విశాఖపట్నం ఆగస్టు 17 నేటి మనదేశమ్ :** వైజాగ్ గాంధీ విగ్రహం జివియంసి పార్క్, ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన దీక్షలలో తుట్టా నూక రాజు, ఉరుకూటి రాజు, ఆర్ కె ఎస్ వి కుమార్ సిఐటియు జిల్లా ప్రధాన నాయ కత్వం మాట్లాడుతూ, అప్కాస్ వర్కర్స్ డెత్ ౖ రిటైర్మెంట్ పోస్టు భర్తీ చెయ్యా లని, మున్సిపల్ కార్మికుల ఉపాధి దెబ్బతీసే 673, 975 జీవోల్ని రద్దు చేయాలని, వివిధ విభాగాలలో జివియంసి విధులు నిర్వ హిస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకి 12వ పిఆర్సి ప్రకటించి పర్మనెంట్ చేయాలని, లేదా సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని, జివియంసి లో పెండింగ్ ఉన్న సమస్యలు పరిష్కారానికై కార్పొరేషన్లలో విధులు నిర్వ హిస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, కార్మికులకు గత 3 ఏళ్లుగా జీతాలు పెరగక పోవడం, జరుగుతున్న జాప్యం వల్ల తీవ్ర నిరసనకు కార్మికులు గురవుతున్నారు. పెరిగిన నిత్యవసర ధరలతో కార్మికుల బ్రతకడం కష్టంగా మారింది అందువల్ల కాంట్రాక్టు /ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని కోరుతున్నాము అని తక్షణమే స్పందించి , కార్మికులు ఎదుర్కొంటున్న ఈ దిగువ పేర్కొన్న సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని గత మూడు రోజులుగా ఉమ్మడి విశాఖ నియోజకవర్గం ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. నేటి నుండి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని జివియంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు నేతలు కోరారు. గొలగాని అప్పారావు, వి.కృష్ణా రావు, ముద్దాడ ప్రసాద్, జే.ఆర్. నాయుడు, నక్క నాగరాజు ఇ. ఆదినారాయణ, గణేష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి మనదేశమ్ NETI MANADESAM
విశాఖపట్నం

# గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో ..వారణాసి మేకింగ్ వీడియో




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ పక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్ఆర్ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. 'వారణాసి' కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.




## రాముడి సుగుణాలు కనిపించాలంటే రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అడ్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్




సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷-గ్గ్ర÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

## చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.



# బిజినెస్ న్యూస్



## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా రెండో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఐదో రోజూ నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 77,892.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,009.25) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 77,453.75 వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ... చివరికి 281.09 పాయింట్ల పతనమై 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,394.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వాట్సప్‌లో పాన్, ఆధార్ వివరాలు.. రిస్క్ కొని తెచ్చుకున్నట్లే!



: రుణాల కోసం బ్యాంకు ఏజెంట్‌ను కలిసినప్పుడు.. పాన్, బ్యాంకు స్టేట్‌మెంట్ వంటి వివరాలు పంపించాలని అడుగుతుంటారు. ఏదైనా హోటల్ గదిలో దిగినప్పుడు ఆధార్ వివరాలు వాట్సప్ చేయాలని కోరుతుంటారు. స్థలం కోసం ఎవరైనా ప్రాపర్టీ బ్రోకర్‌ను కలిసినా కావాల్సిన వివరాలను వ్యక్తిగత నంబర్‌కు వాట్సప్ చేయాలని చెప్తుంటారు. వారు వివరాలు అడగ్గానే.. సులువుగా ఉంది కదా అని మీ వ్యక్తిగత వివరాలను వాట్సప్ చేయడమంటే కోరి రిస్కును కొనితెచ్చుకున్నట్లే. దీనివల్ల వ్యక్తిగత డేటా బహిర్గతం అయ్యే అవకాశం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమస్య ఇక్కడే..

ఒకసారి వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలను వాట్సప్ ద్వారా ఇతరులకు పంపినప్పుడు, అవతలి వ్యక్తి వాటిని తమ ఫోన్‌లో లేదా ల్యాప్‌టాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఆ పత్రాలు ఆటోమేటిక్‌గా వారి క్లౌడ్ బ్యాకప్‌లో సేవ్ అవుతాయి. వాస్తవానికి మోసం చేయాలన్న ఉద్దేశం ఆ వ్యక్తికి లేకపోయినా.. ఎప్పుడైనా ఆ డివైజ్ లేదా వారి ఖాతా సైబర్ దాడికి గురైనప్పుడు మీ డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. రేప్పొద్దున ఫలానా కంపెనీకి ఆయా వివరాలు పంపినప్పుడు దుర్వినియోగం అయ్యిందని చెప్పడానికీ ఉండదు. ఎందుకంటే మీరు పంపిన డేటా పద్ధతి ఆ కంపెనీకి సంబంధించిన సైబర్ సెక్యూరిటీ పరిధిలోకి రాదనే విషయం గుర్తుంచుకోవాలి.

మరేం చేయాలి?

ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు అడిగినప్పుడు వాట్సప్ ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ వివరాలు పంపించొద్దు. కంపెనీ లేదా బ్యాంక్‌కు చెందిన అధికారిక లింక్‌ను లేదా డాక్యుమెంట్ అప్‌లోడ్ చేసే సెక్యూర్ పోర్టల్ లింక్‌ను పంపాలని అడగండి.

బ్యాంకులకు, రుణదాతలకు లేదా హోటల్ వంటి వ్యాపార అవసరాలకు ప్రత్యామ్నాయ వెరిఫికేషన్ పద్ధతులు ఉన్నాయోమో అడిగి తెలుసుకోండి. డిజిలాకర్ లేదా ఉడాయ్‌కి చెందిన ఆఫ్-లైన్ వెరిఫికేషన్ పద్ధతులు అందుబాటులో ఉంటే ఆ రూపంలో మీ వివరాలు ధ్రువీకరించుకోవాలని సూచించొచ్చు.

ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వ్యక్తిగత ఫోన్ నంబర్‌కే పత్రాలను పంపాల్సి వస్తే, ఆ ఫైల్‌ను పాస్‌వర్డ్ ప్రొటెక్ట్‌తో షేర్ చేయడం మంచిది. ఆ పాస్‌వర్డ్‌ను విడిగా తెలియజేయండి. వీలైనంత వరకు ఆధార్‌లోని చివరి 4 అంకెలు మాత్రమే కనిపించే మాస్క్‌డ్ ఆధార్ కాపీలను ఉపయోగించండి.

## వంటగ్యాస్ కొరత రాకుండా చూద్దాం



పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో, సరఫరాలకు ఆటంకాలు ఏర్పడి, మన దేశంలో వంటగ్యాస్ (ఎల్‌పీజీ)కు తీవ్ర కొరత వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవిష్యత్తులో దిగుమతులకు అంతరాయం ఏర్పడినా, దేశీయంగా వంటగ్యాస్ కొరత రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. అందుకే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ చమురు కంపెనీలకు తొలిసారిగా 'ఉత్పత్తి లక్ష్యాలను' కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ కంపెనీలు కలిపి రోజుకు గరిష్ఠంగా 63,810 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయగలవు. ఇది 2025-26లో దేశీయంగా జరిగిన ఎల్‌పీజీ ఉత్పత్తి కంటే రెట్టింపు కాగా, దేశ రోజువారీ అవసరాల్లో దాదాపు 70 శాతానికి సమానం. దేశంలో కొరత తలెత్తినప్పుడు ఈ లక్ష్యాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అధిక కోటా లభించింది.

ఉత్పత్తి లక్ష్యాలు ఇలా..

రిలయన్స్ ఇండస్ట్రీస్: గుజరాత్ జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీకి దేశంలోనే అత్యధికంగా రోజుకు 18,000 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని విధించారు. ఎగుమతుల కోసం ఉద్దేశించిన 35.2 మి.టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్‌కు ఎటువంటి లక్ష్యాన్ని పెట్టలేదు.

ప్రభుత్వ రంగ రిఫైనరీలు: ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు చెందిన 18 రిఫైనరీలు సంయుక్తంగా రోజుకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

నయారా ఎనర్జీ: వడినార్‌లోని నయారా రిఫైనరీకి రోజుకు 4,480 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు.

అప్‌స్ట్రీమ్ కంపెనీలు: సహజవాయువు, ఎల్‌పీజీని వెలికి తీసే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలకు రోజుకు 6,460 టన్నుల ఉత్పత్తి పరిమితిని కేటాయించారు.

రోజుకు 91,000 టన్నుల వినియోగం 2025-26లో దేశంలో మొత్తం 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగమైంది. అంటే రోజువారీ వినియోగం 91,000 టన్నులుగా ఉంది. ఇందులో దేశీయ ఉత్పత్తి 13.1 మి.టన్నులు మాత్రమే. మిగిలిన 21.3 మి.టన్నుల (రోజుకు 58,400 టన్నుల) అవసరాలు దిగుమతుల ద్వారానే తీరాయి. వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 64% దిగుమతులే తీర్చాయి. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో పెట్రోరసాయనాల ముడిసరకును ఎల్‌పీజీకి మళ్లించడం, వంటి తాత్కాలిక చర్యలతో ఉత్పత్తిని రోజుకు 55,000 టన్నులకు పెంచగలిగారు.

# 12.5 కోట్ల మంది ప్రయాణించేలా దిల్లీ విమానాశ్రయ విస్తరణ



దేశంలోనే పెద్దదైన దిల్లీ విమానాశ్రయం.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాబోయే 10 ఏళ్లకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. విమానాశ్రయ వార్షిక ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని ప్రస్తుత 10.6 కోట్ల నుంచి 12.5 కోట్లకు పెంచేందుకు దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం మూడు టెర్మినల్స్ సామర్థ్యం 10.6 కోట్లుగా ఉంది. ఇందులో టీ1 4.2 కోట్లు, టీ2 1.4 కోట్లు, టీ3 టెర్మినల్ 5 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. 2030 ఏప్రిల్ నాటికి ప్రయాణికుల వార్షిక నిర్వహణ సామర్థ్యాన్ని 11.6 కోట్లకు పెంచనున్నారు. 2032కి రెండో దశలో 12.5 కోట్లు చేయనున్నారు. 2036 ప్రణాళికలను భాగస్వాములందరితో చర్చించాక, ఖరారు చేయనున్నారు. టెర్మినల్ 3 వద్ద అదనంగా కోటి మంది ప్రయాణికుల సామర్థ్యంతో కొత్త 'పియర్ ఈ'ని 2030 ఏప్రిల్ నాటికి నిర్మించాలని ప్రతిపాదించారు. టెర్మినల్ 1 నుంచి టీ2, టీ3 మధ్య ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేందుకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల ఆటోమేటెడ్ పీపుల్ మూవర్ (ఏపీఎం) వ్యవస్థకు ప్రస్తుతానికి తక్షణ నిర్ణయం తీసుకోకపోయినా, మాస్టర్ ప్లాన్‌లో స్థలాన్ని కేటాయిస్తారు. భవిష్యత్తు అవసరాలు, రద్దీని బట్టి టీ2ని టీ4గా మార్చే అంశాన్ని పరిశీలించనున్నారు. ఈ ఏడాది జులైలో దిల్లీ విమానాశ్రయం నుంచి 60 లక్షల మంది ప్రయాణించారు. 2026-27 ఏప్రిల్-జులై మధ్య 2.64 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు నమోదయ్యాయి.



# ధర్మేంద్ర ప్రధాన్‌కు కీలక పదవి?

- నితిన్ నబిన్ టీమ్‌పై ఉత్కంఠ
- సీనియర్లకు కీలక పదవులు
- భారీ మార్పులపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: జెన్ జీ పోరాటంతో కేంద్ర మంత్రి పదవి కోల్పోయిన ధర్మేంద్ర ప్రధాన్‌కు బీజేపీలో కీలక పదవి దక్కనుందని వార్తలు వస్తున్నాయి. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయనను నియమించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో ఊహాగానాలు వెలుడుతున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో ఏర్పడబోయే కొత్త టీమ్‌పై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు సీనియర్ నాయకులకు పార్టీలో కీలక పదవులు దక్కనున్నాయని ప్రచారం జరుగుతోంది. బీజేపీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. సీనియర్ నేతలు సతీష్ పూనియా, ధర్మేంద్ర ప్రధాన్, అనురాగ్ ఠాకూర్, స్మృతి ఇరానీలకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్ మాజీ బీజేపీ అధ్యక్షుడు వీడీ శర్మకు కూడా పెద్ద బాధ్యత దక్కవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అది బీజేపీ సంస్థాగత వ్యవస్థలో కావొచ్చు లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంత్రివర్గంలో కావొచ్చని సమాచారం. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ దేవ్ పేరు కూడా కీలక పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ జాబితాపైనే ప్రధాన దృష్టి!

నితిన్ నబిన్ కొత్త టీమ్‌లో అత్యంత కీలకమైన మార్పులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శుల విషయంలో ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం బీజేపీకి ఏడుగురు జాతీయ ప్రధాన కార్యదర్శులు ఉన్నారు. వీరిలో అరుణ్ సింగ్, దుష్యంత్ గౌతమ్, వినోద్ తావ్డే, తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, రాధామోహన్ దాస్ అగర్వాల్, బీఎల్ సంతోష్ ఉన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా ఉన్న బీఎల్ సంతోష్ మాత్రం కొనసాగడం దాదాపు ఖాయమని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పదవిని సాధారణంగా ఆర్ఎస్ఎస్‌కు చెందిన నేతకే కేటాయిస్తారు. అయితే ఆయనకు కొత్త డిప్యూటీలను నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. దుష్యంత్ గౌతమ్, రాధామోహన్ దాస్ అగర్వాల్‌లకు విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

వారిద్దరికి కీలక బాధ్యతలు?

ఇదే విభాగంలో కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, సతీష్ పూనియాలను తీసుకురావచ్చని బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యువత, అనుభవజ్ఞుల కలయికతో టీమ్‌ను ఏర్పాటు చేయాలన్న నితిన్ నబిన్ ఆలోచనలో భాగంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను కూడా జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ పేర్లపై బీజేపీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఉత్తరాది నుంచి భాటియా పేరు!

ఉత్తర భారతదేశం నుంచి హర్యానాలోని కర్నాల్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ సంజయ్ భాటియా పేరు కూడా బీజేపీ కొత్త టీమ్‌లో కీలక బాధ్యత కోసం వినిపిస్తోంది. ఆయనకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఏదైనా ముఖ్యమైన పదవి దక్కవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే, నితిన్ నబిన్ ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ సంస్థాగత వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లు, పదవులపై ఊహాగానాలే తప్ప, తుది నిర్ణయాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.

## కిమ్ మీద ప్రేమతో..

# దక్షిణ కొరియాకు షాకిచ్చిన ట్రంప్



ఇరాన్ విషయంలో అమెరికాకు మద్దతుగా నిలవడానికి మిత్రదేశం దక్షిణ కొరియా విముఖత వ్యక్తం చేసింది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దక్షిణకొరియాకు షాకిచ్చారు. ఆ దేశంతో నిర్వహించే సంయుక్త సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని తమ రక్షణ శాఖను ఆదేశించారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో ఉన్న బంధం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ మేరకు ఆయన తన ట్రూత్ ఖాతాలో పేర్కొన్నారు. "కిమ్‌తో నాకున్న మంచి స్నేహ బంధం దృష్ట్యా దక్షిణ కొరియాతో అమెరికా చేపట్టాల్సిన సంయుక్త సైనిక చర్యలను తగ్గించాలని అనుకుంటున్నా. ఈ విన్యాసాలు ఖర్చుతో కూడుకున్నవి. అందుకు వెచ్చించాల్సిన మొత్తంలో ఎక్కువ వ్యయాన్ని అమెరికానే భరిస్తోంది. ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. ఇక, ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునే చర్యల్లో అమెరికాతో కలిసి రావాలని దక్షిణ కొరియా అధ్యక్షుడిని కోరగా.. ఆయన రాలేమని చెప్పారు" అని ట్రంప్ రాసుకొచ్చారు. కాగా.. ఈ పోస్ట్‌కు కొద్ది గంటల ముందు కిమ్‌తో 2019లో దిగిన ఓ ఫొటోను ట్రంప్ పంచుకున్నారు. ఇక, జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి మిత్ర దేశాలు కూడా ఇరాన్ విషయంలో అమెరికాకు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వడంపై వెనుకంజ వేస్తున్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.కాగా.. 'ఉల్చి ఫ్రీడం షీల్డ్' పేరుతో అమెరికా–దక్షిణ కొరియా ఇటీవల సంయుక్త సైనిక విన్యాసాలు ప్రకటించాయి. సోమవారం నుంచి 11 రోజులపాటు ఇవి జరగనున్నాయి. ఇందులో సుమారు 18 వేల మంది దక్షిణ కొరియా సైని కులు పాల్గొంటారు. అయితే ఈ విన్యాసాలు షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతాయని సియోల్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. 2018లో కిమ్‌తో అణు చర్చలు జరిపిన సమయంలోనూ ట్రంప్.. అమెరికా–దక్షిణ కొరియా సైనిక విన్యాసాలను నిలిపివేశారు. తాజాగా కిమ్‌తో మళ్లీ స్నేహపూర్వక సంబంధాలపై మాట్లాడటం, సైనిక విన్యాసాలను తగ్గించాలని ఆదేశించడంతో ఉత్తర కొరియాతో చర్చలకు ట్రంప్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే..

# జీతంలో 20శాతం కోత



ఢిల్లీ : బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

# ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రశాంత్ కిషోర్



పాట్నా: జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్(పీకే) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం బీహార్ శాసనసభలో స్పీకర్ ప్రేమ్ కుమార్ సమక్షంలో బంకిపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 3వ తేదీన బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో పీకే ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995 నుండి బీజేపీ కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని దక్కించుకున్న పీకే.. బీజేపీకి గట్టి దెబ్బ కొట్టి చరిత్రాత్మక ఎన్నికల రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 64,151 ఓట్లు సాధించిన పీకే.. బీజేపీకి చెందిన నీరజ్ కుమార్‌ను 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో.. బంకీపూర్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

# 2వ ప్రపంచ యుద్ధం తర్వాత రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో..



భారత సంతతికి చెందిన 28 ఏళ్ల ఫ్లైట్ లెఫ్టినెంట్ అర్ష్‌దీప్ సింగ్ డాంగ్, బ్రిటన్ చెందిన రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గా పట్టా పొందిన తొలి సిక్కు వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక సిక్కు యోధుడు ఫైటర్ స్క్వాడ్రన్ నుండి 'వింగ్స్' సాధించడం ఇదే తొలిసారి అని RAF తెలిపింది. నార్త్ వేల్స్‌లోని '=ాఖీ వ్యాలీ'లో జరిగిన వేడుకలో అర్ష్‌దీప్ సింగ్ పట్టభద్రుడయ్యారు. తన తండ్రిని పైలట్‌గా చూడాలనేది తాతగారైన సర్దార్ సంతోఖ్ సింగ్ డాంగ్ కల అని, అయితే ఆయన చిన్నతనంలోనే మరణించడంతో ఆ అవకాశం రాలేదని అర్ష్‌దీప్ తెలిపారు. తల్లి దండ్రుల ప్రోత్సాహంతో తాతగారి కలను తాను నిజం చేసినట్లు అర్ష్‌దీప్ వెల్లడించారు. రక్షణ రంగంలో ఫ్రంట్‌లైన్ ఫైటర్ విమానాలను నడిపేందుకు ఆయన మరో ఏడాది పాటు కఠినమైన శిక్షణ తీసుకోనున్నారు. 1998లో చండీగఢ్‌లో జన్మించిన అర్ష్‌దీప్, తన ఆరేళ్ల వయసులో కుటుంబంతో కలిసి యూకే వెళ్లారు. ప్రస్తుతం వారి కుటుంబం ఇంగ్లాండ్ లోని సౌత్ ఆల్‌లో నివసిస్తోంది. ఆయన తండ్రి జగ్‌దీప్ సింగ్ డాంగ్ (లుధియానా), తల్లి గగన్‌దీప్ కౌర్ (అమృత్‌సర్). బ్రిస్టల్ విశ్వవిద్యాలయంలో గణితం మరియు తత్వశాస్త్రం అభ్య సించిన ఆయన, 20 22లో ఆఫీసర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. 2025లో ఫాస్ట్ జెట్ శిక్షణ ప్రారంభించి, అక్టోబర్ 2025లో టెక్సాస్‌లో సోలో ఫ్లైట్ పూర్తి చేశారు. జులై 2026లో 'వింగ్స్ టెస్ట్'లో ఉత్తీర్ణులయ్యారు. మొదటి ప్రపంచ యుద్ధ పైలట్ ఇంద్రలాల్ రాయ్, హర్దిత్ సింగ్ మాలిక్, స్క్వాడ్రన్ లీడర్ మోహిందర్ సింగ్ పూజ్జీ సహా, బ్రిటిష్ సైనిక విమానయానంలో సేవలందిం చిన భారతీయ సంతతికి చెందినఈ ఘనత సాధించి భారతీయుల సరసన అర్ష్‌దీప్ చేరారు.

# నాసాకు వీడ్కోలు పలికిన సీనియర్ వ్యోమగామి..



వాషింగ్టన్: దాదాపు మూడు దశాబ్దాలుగా నాసాలో సేవలందించిన సీనియర్ వ్యోమగామి మైక్ ఫింకె నాసాకు వీడ్కోలు పలికారు. ఆగస్టు–12 బుధవారంతో నాసాలో ఆయన సేవలు ముగిశాయని అమెరికా అంతరిక్ష సంస్థ వెల్లడించింది. అయితే అంతరిక్ష పరిశోధనలు, అన్వేషణలో తన వంతు పాత్ర కొనసాగిస్తానని ఫింకె తెలిపారు. 1996లో నాసా వ్యోమగాముల బృందంలో చేరిన ఫింకె.. తన సుదీర్ఘ కెరీర్‌లో నాలుగు అంతరిక్ష యాత్రలు చేశారు. మొత్తం 549 రోజులు అంతరిక్షంలో గడిపిన ఆయన.. నాసా వ్యోమగాముల్లో అత్యధిక కాలం అంతరిక్షంలో గడిపిన వారిలో నాలుగో స్థానంలో ఉన్నారు. అలాగే తొమ్మిది సార్లు స్పేస్‌వాక్ నిర్వహించారు. ఆయన కెరీర్‌లో ఎక్కువ సమయం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లోనే గడిచింది.

అంతరిక్ష కేంద్రంలో అకస్మాత్తుగా అస్వస్థత..

ఇటీవల ఫింకె చేపట్టిన చివరి అంతరిక్ష యాత్ర మాత్రం అనూహ్య పరిణామాలతో ముగిసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా ఓ వైద్య సమస్య తలెత్తింది. దాదాపు 20 నిమిషాల పాటు మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోయినట్లు ఫింకె స్వయంగా వెల్లడించారు. ఆయన పరిస్థితిని గమనించిన సహచరులు వెంటనే స్పందిం చారు. కొన్ని సెకన్లలోనే మొత్తం బృందం అప్రమత్తమై వైద్య సహాయం అందించిందని ఆయన తెలిపారు. అయితే ఈ అస్వస్థతకు అసలు కారణం ఇప్పటికీ స్పష్టంగా తెలియ లేదని, నాసా మరియు వైద్య పరిశోధకులు దానిపై దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

ముందుగానే భూమికి తిరుగు ప్రయాణం

ఫింకెతో పాటు స్పేస్‌ఎక్స్ క్రూ–11లో ఉన్న మరో ముగ్గురు సభ్యులు –నాసా వ్యోమగామి జీనా కార్డ్‌మన్, జపాన్‌కు చెందిన కిమియా యుయి, రష్యాకు చెందిన ఒలెగ్ ప్లాటోనోవ్ అనుకున్న సమయం కంటే కొన్ని వారాల ముందుగానే భూమికి తిరిగి వచ్చారు. అంతరిక్ష కేంద్రంలో అందుబాటులో లేని అధునాతన వైద్య ఇమేజింగ్ సదుపాయాలను భూమిపై ఉపయోగించేందుకు సిబ్బందిని ముందుగానే వెనక్కి తీసుకురావాలని నిర్ణయించినట్లు నాసా తెలిపింది.

ఈ ఘటన కారణంగా అంతరిక్ష కేంద్రంలో సిబ్బంది నిర్వహించాల్సిన ఓ స్పేస్‌వాక్‌ను కూడా రద్దు చేశారు. అలాగే, ఆరోగ్య కారణాలతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సిబ్బంది యాత్రను నాసా ముందుగానే ముగిం చాల్సిన పరిస్థితతి రావడం ఇదే తొలిసారి.నాసా నుంచి వైదొలు గుతున్నప్పటికీ అంతరిక్ష అన్వేషణకు తన నిబద్ధత కొనసాగుతుందని ఫింకె పేర్కొన్నారు.

# ఆటోడ్రైవర్ ఇంట్లో నోట్ల కట్టలు..

## 4 బ్యాగుల్లో రూ.3 కోట్లు



భోపాల్: ఒక చిన్న ఇల్లు అది.. పోలీసులు తలుపులు తెరిచారు అంతే.. బయటికి కనిపించని ఓ భారీ రహస్యం ఒక్కసారిగా బయటపడింది. సాధారణంగా కనిపించే ఆ ఇంట్లో దాచిన డబ్బును చూసి అక్కడికి వెళ్లిన వారే ఒక్క సారిగా షాక్‌కు గుర య్యారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో పోలీసులకు రూ.3 కోట్లకు పైగా నగదు దొరికింది. అయితే పోలీసులు అక్కడికి వెళ్లింది డబ్బు కోసం కాదు.. సోషల్ మీడియాలో ఆ డ్రైవర్ చేతిలో కనిపించిన పిస్టల్ ఫొటోపై విచారణ కోసం. గోపాల్‌గంజ్ పోలీస్‌లు ఆటో డ్రైవర్ సౌరభ్ అహిర్వార్ ఇంట్లో సోదాలు చేశారు. ఆ సమయంలో ఓ లాక్ చేసిన అల్మారా కనిపించింది. దాని తాళం కుటుంబ సభ్యుల వద్ద లేకపోవడంతో పోలీసులు నిబంధనల ప్రకారం దాన్ని తెరిచారు. అందులో 4 బ్యాగుల్లో భారీగా నోట్ల కట్టలు కనిపించాయి. ఒక్క బ్యాగులోనే సుమారు రూ.1.33 కోట్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నాలుగు బ్యాగుల్లో కలిపి మొత్తం రూ.3 కోట్లకు పైగా నగదు ఉన్నట్లు తేలింది. డబ్బును లెక్కించేందుకు కరెన్సీ కౌంటింగ్ మెషీన్ ఉపయోగించారు. సోదాలు, నగదు లెక్కింపు ప్రక్రియను వీడియోలో రికార్డు చేశారు. ఈ డబ్బు తమది కాదని కుటుంబ సభ్యులు చెప్పారు. రమేశ్ అహిర్వార్ అనే బంధువు డబ్బును 8–9 నెలల క్రితం అక్కడ ఉంచి వెళ్లారని వారు తెలిపారు. రమేశ్ అహిర్వార్ భోపాల్‌లోని చునాభట్టి ప్రాంతంలో ఉంటారని, పీడబ్ల్యూడీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారని కుటుంబం చెబుతోంది.

అయితే రూ.3 కోట్ల నగదును ఎందుకు ఇంట్లో ఉంచారు? డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? దానికి చట్టబద్ధమైన ఆధా రాలు ఉన్నాయా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయపు పన్ను, రెవెన్యూ తదితర సంబంధిత విభాగాలకు కూడా సమాచారం ఇవ్వనున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ డబ్బు పీడబ్ల్యూడీ ఇంజినీర్‌దేనని పోలీసులు నిర్ధారించ లేదు. అది రమేశ్ అహిర్వార్‌దేనని కుటుంబ సభ్యులు చేసిన వాదన మాత్రమే. పోలీసులు నగదు మూలాన్ని విచారిస్తున్నారు.

# డ్రైనేజ్ తవ్వుతుంటే బయటపడిన రూ.98 కోట్ల బంగారం..

## 18 ఏళ్ల యువకుడికి దొరికిన భారీ నిధి..



బ్రస్సెల్స్ : సాధారణంగా మురుగు కాలువ పనులు చేస్తుండగా మట్టి, రాళ్లు బయటపడటం సహజం. కానీ బెల్జియంలో ఓ 18 ఏళ్ల యువకుడికి మాత్రం ఏకంగా కోట్ల విలువైన బంగారు నిధి దొరికింది. డ్రైనేజీ పైపుల కోసం తవ్వకాలు చేపడుతుండగా అతడికి బంగారు నాణేలు, బంగారు కడ్డీలు కనిపించాయి. ఈ మొత్తం నిధి విలువ సుమారు 90 లక్షల యూరోలు.. భారత కరెన్సీలో దాదాపు రూ.98 కోట్లు ఉంటుందని అంచనా.సింట్–గిల్లిస్–డెండర్ మొండే ప్రాంతంలో ఓ నిర్మాణ సంస్థలో వేసవి ఉద్యోగిగా పనిచేస్తున్న 18 ఏళ్ల కోబే ఈ నిధిని గుర్తించాడు. సహచరులతో కలిసి మురుగు కాలువ కోసం భూమిని తవ్వుతుండగా ఏదో వస్తువు కనిపించింది. మొదట అవి సాధారణ ఒక యూరో నాణేలు అనుకున్నామని కోబే చెప్పాడు. మరికొంత తవ్విన తర్వాత బంగారు కడ్డీ కనిపించడంతో అసలు విషయం అర్థమైందని వివరించాడు. బంగారు నాణేలు, బంగారు కడ్డీలను ఓ సంచిలో పెట్టి, పాత భవనం కింద ఉన్న నేలమాళిగ గోడలో ఇటుకల మధ్య దాచినట్లు తెలిపాడు

ఈ భవనం 19వ శతాబ్దం చివర్లో బీరు తయారీ వ్యాపారి థియోఫిలస్ వాన్ అస్చే కోసం నిర్మించిన విల్లాగా తెలుస్తోంది. నిధి బయటపడిన వెంటనే కోబే, అతడి సహచరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకుని బ్రస్సెల్స్‌లోని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రస్తుతం బంగారం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు దాచారు? అసలు యజమాని ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు జరుగుతోంది ఈ నిధిపై హక్కు విషయంలో ఇప్పుడు అసలు వివాదం మొదలయ్యే అవకాశం ఉంది. బెల్జియం చట్టం ప్రకారం అసలు యజమానులు లేదా వారి వారసులు నిధిపై హక్కును కోరేందుకు ఐదేళ్ల వరకు అవకాశం ఉంటుంది.

ఈ వ్యవధిలో ఎవరూ హక్కును నిరూపించలేకపోతే తదుపరి చట్టపరమైన ప్రక్రియ అమలవుతుంది. భారీ నిధిని గుర్తించిన కోబే, అతడి సహచరులకు కూడా రివార్డ్ లభించే అవకాశం ఉంది.

# ఈ నెల 21నుండి 24 వరకు
# విశాఖలో బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సమావేశం

**– పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేయాలి – జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్**



**విశాఖపట్నం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సమావేశం–2026 (క్రీడా కార్యవర్గ సమావేశం మరియు క్రీడా మంత్రుల సమావేశం) కు ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట మైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో బ్రిక్స్ క్రీడా మంత్రుల సమా వేశం నిర్వాహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీలలో విశాఖ పట్నంలోని నోవోటెల్ హోటల్లో బ్రిక్స్ క్రీడా మంత్రుల సమా వేసం జరుగుతుందని ,11 దేశాలకు సంబంధించిన మంత్రులు, అధికారులు ఈ సమావేశం లో పాల్గొంటున్నందున అంత ర్జాతీయ స్థాయి కి తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం–2026 కోసం ఇతర దేశాలకు చెందిన మంత్రులు , డెలిగేట్స్ 21,22 వ తేదీలలో నగరానికి చేరుకుని 24 వ తేదీ తిరిగి వెళతారని అన్నారు. విశాఖ పట్నంలో ప్రత్యక్షంగా జరిగే ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కోరారు. ఈ సమావేశం క్రీడాభివృద్ధి, క్రీడా సాంకేతికత, క్రీడా పరిశ్రమ, సామర్థ్య నిర్మాణం, మరియు సాంప్రదాయ, దేశీయ క్రీడల ప్రోత్సాహం, పరిరక్షణ వంటి రంగాలలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుందని ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఈ సమావేశానికి అంతర్జాతీయ ప్రముఖులు హాజరుకానున్నందున అంతర్జాతీయ కార్యక్రమాన్ని ఘనంగా, సముచితంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసు కోవాలని, మరియు ఈ కార్యక్రమం సజావుగా,, విజయవంతంగా జరిగేలా చూసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి బ్రిక్స్ సభ్య దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్కు చెందిన క్రీడా మంత్రులు మరియు అధికారిక ప్రతినిధులు సుమారు 50 నుండి 70 మంది ప్రముఖులతో పాటు కేంద్ర క్రీడల శాఖా మంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లేదా విద్యాశాఖ మంత్రి హాజరు కానున్నారని ఇతర మంత్రులు అంతర్జాతీయ సమావేశానికి సంబంధించిన ప్రారంభోత్సవం మరియు ఇతర కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉందని వారికి విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ, నోవోటెల్ హోటల్లో వసతి ఏర్పాట్లు పూర్తి చేయాలని, భద్రత మరియు ప్రోటోకాల్ ఏర్పాట్లను పగడ్బందీగా ఏర్పాటుచేయాలని తెలిపారు. విజయనగరం జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని ఎయిర్ పోర్టు వద్ద స్వాగతం ,రవాణా ఏర్పాట్లు , లైజన్ అధికారులు ఏర్పాటు, GVMC అధికారులు శానిటేషన్, టూరి జం అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అందరూ సమన్వయం తో పని చేయాలని తెలిపారు. 22 వ తేదీ రాత్రి నోవాటెల్ లో గాల డిన్నర్ లో పాల్గొంటారని,23 వ తేదీ RK బీచ్ లో సైకిల్ ర్యాలీ, కైలాసగిరి లో గ్లాస్ బ్రిడ్జి సందర్శన,మొక్కలు నాటే కార్యక్రమం, తొట్లకొండ, రుషికొండ బీచ్లలో పలు కార్యక్రమాల లో పాల్గొంటారని తెలి పారు., 23 వ తేదీ ఉదయం నోవాటెల్ లో స్పోర్ట్ వర్కింగ్ గ్రూప్ మీటింగ్ లో పాల్గొంటారు. మినిట్ టు మినిట్ కార్యక్రమం ప్రకారం కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా రెవిన్యూ, పోలీసు, జి.వి.ఎం.సి., టూరిజం, సెట్విస్, క్రీడాశాఖ, అటవీ శాఖ తదతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని, కార్యక్రమం విజయవంతం చేయా లని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ చ మణికంఠ,ఐతీశీ విశ్వేశ్వర నాయుడు, Setvis CEO రమ్య,ఙూఙా గాలియట్ GVMC additional commissioner నల్లనయ్య,,పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జోన్‌లో జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

- ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన.
- ఏఎంసీ--వాంబే కాలనీ నివాసితుల వివరాలపై సర్వే చేసి వారంలో నివేదిక ఇవ్వాలి.
- రూ.47 లక్షలతో పునరాభివృద్ధి చేసిన రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియాన్ని త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.
- రింగ్ రోడ్డులో నిలిచిపోయిన 300 మీటర్ల రోడ్డు విస్తరణ, డ్రైన్ల పనులు పూర్తి చేయాలి.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.







**విశాఖపట్నం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** అనకాపల్లి జోన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతులు, రహదారులు, ప్రజోపయోగ సదుపాయాల అభివృద్ధిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, పర్యవేక్షక ఇంజ నీర్లు కె. శ్రీనివాసరావు, తిరుమలరావు, ఇతర అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించి, చేపట్టాల్సిన పనులపై అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. నర్సింగరావు పేట సచివాలయ పరిధిలోని ఏఎంసీ –వాంబే కాలనీలో నివసిస్తున్న ప్రజల విజ్ఞప్తి మేరకు కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికు లతో మాట్లాడారు. తాము 20 సంవత్సరాలకు పైగా నివసిస్తున్నామని, సుమారు 144 కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి, ఇంటి పన్నులు విధించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, నివాసితుల వద్ద ఉన్న ఆధార పత్రాలను పరిశీలించి, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి వారం రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనకాపల్లిలో ?47 లక్షలతో పునరాభివృద్ధి చేసిన రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన కమిషనర్, జిమ్ పరికరాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి స్టేడియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అనకాపల్లి రింగ్ రోడ్డులోని 100 అడుగుల రహదారిలో పిల్లావారి వీధి నుంచి పెంటకోట కన్వెన్షన్ వరకు సుమారు 300 మీటర్ల మేర నిలిచిపోయిన రోడ్డు విస్తరణ, డ్రైన్ల నిర్మాణ పనులను పూర్తి చేసి రహదారిని విని యోగంలోకి తీసుకురావాలని కార్య నిర్వాహక ఇంజనీర్ శేఖర్, డీసీపీ మధు సూదన్ రావు, జోనల్ కమిషనర్ చక్రవర్తిని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన అంశాలపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టి వారం రోజుల్లో పురోగతి చూపాలని, పెండింగ్‌లో ఉన్న ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్, యూసీడీ తదితర విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# 19 నుంచి గుడిలోవలో ఆర్ఎస్ఎస్ సమన్వయ బైఠక్

**ఆనందపురం,, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రేరణతో వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంస్థల అఖిల భారతీయ సమన్వయ బైఠక్ ఈ నెల 19 నుంచి 21 వరకు విశాఖపట్నం జిల్లా గుడిలోవలో జరగనుంది. దేశవ్యాప్తంగా సంఘ్ ప్రేరణతో పనిచేస్తున్న 32 సంస్థలకు చెందిన అఖిల భారత స్థాయి బాధ్యులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఆయా సంస్థల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంఘటనా మంత్రులు, ఎంపిక చేసిన ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు. సంస్థల కార్యకలాపాలు, సమాజంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలపై ప్రతినిధులు తమ అనుభవాలు, సూచనలను పంచుకోనున్నారు. సంస్థల మధ్య పరస్పర సమన్వయం, సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజా సంక్షేమం, విధానపరమైన అంశాలపై చర్చించనున్నారు. జనాభా అసమతుల్యత, మాదకద్రవ్యాల నిర్మూలన, యువతలో చైతన్యం, 'పంచ పరివర్తన' కార్యక్రమం, అభివృద్ధిపై భారతీయ దృక్పథం తదితర సమకాలీన అంశాలు బైఠక్‌లో చర్చకు రానున్నాయి.

# విశాఖపట్నంలోని కీలక సంస్థలను సందర్శించిన సీఐఎస్ఎఫ్, డీజీ, ప్రవీర్ రంజన్



**విశాఖపట్నం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :**

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్ ఆగస్టు 15, 16 తేదీలలో విశాఖప ట్నంలోని కీలక వ్యూహాత్మక సంస్థలను సందర్శించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సందర్శన సందర్భంగా, ఆయన భద్రత మరియు కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించారు. అలాగే, ఈ కీలక సంస్థ యొక్క భద్రత మరియు రక్షణకు సంబంధించిన విషయాలపై ఆర్ఐఎన్ఎల్ చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎన్.వి.ఎస్. ప్రభాకర్, సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారులు మరియు సీఐఎస్ఎఫ్ సిబ్బందితో చర్చలు జరిపారు. విశాఖపట్నం పోర్టు సందర్శన సందర్భంగా డీజీ సీఐఎస్ఎఫ్ కీలక భద్రతా సంస్థలను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లు, శిక్షణా అంశాలు మరియు కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించారు. పోర్టు భద్రత మరియు సీఐ ఎస్ఎఫ్–పోర్ట్ అథారిటీ మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయ డంపై ఆయన విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఐఆర్‌టీఎస్ మరియు వీపీఏ డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి కొరటి లతో చర్చలు జరిపారు. విశాఖపట్నం లోని అన్ని సీఐఎస్ఎఫ్ యూనిట్ల సంయుక్త సైనిక్ సమ్మేళనంలో ప్రసంగిస్తూ, డీజీ భవిష్యత్ భద్రతా వ్యూహాలు, సాంకేతిక ఉన్నతీకరణ, కార్యాచరణ సంసిద్ధత, క్రమశిక్షణ, మరియు సిబ్బంది శారీరక, మానసిక శ్రేయస్సుపై ఉద్ఘాటిం చారు. దళంలో మహిళా సిబ్బంది కీలక పాత్రను, పెరుగుతున్న వారి సహకారాన్ని ఆయన ప్రత్యే కంగా ప్రస్తావించారు. ముఖ్యంగా, సీఐఎస్ఎఫ్ 10వ రిజర్వ్ బెటాలియన్‌లో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ మహిళా కమాండోల విజయా లను ఆయన ప్రశంసించారు. ఇటీవల ముగిసిన కామన్వెల్త్ గేమ్స్ మరియు పోలీస్ గేమ్స్‌లో సీఐఎస్ఎఫ్ మహిళా బృందం కనబరిచిన ప్రశంసనీయమైన ప్రదర్శనను కూడా ఆయన కొనియాడారు. వృత్తిపరమైన నైపుణ్యానికి, దేశంలోని కీలక ఆస్తులు మరియు ముఖ్యమైన మౌలిక సదు పాయాల భద్రత, రక్షణను బలోపేతం చేయడానికి సీఐఎస్ఎఫ్ కట్టుబడి ఉందని డీజీ పర్యటన పునరుద్ఘాటించింది.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 79 వినతులు

**– జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్.వర్మ, డి.వి. రమణమూర్తి**



**విశాఖపట్నం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (PGRS) కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 79 వినతులు స్వీకరించామని జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్.వర్మ,డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం వారు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు వారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 79 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 03, మధురవాడ జోన్ కు 16, ఈస్ట్ జోన్ కు 19, వెస్ట్ జోన్ కు 01, నార్త్ జోనుకు 12, సౌత్ జోన్ కు 06, పెందుర్తి జోన్ కు 05, అగనంపూడి జోన్ కు 03, గాజువాక జోన్ కు 09, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 05 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జోనల్ అడ్మినిస్ట్రేషన్ కు 03, జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ ఒ అకౌంట్సు విభాగమునకు 03, రెవెన్యూ విభాగమునకు 09, ప్రజారోగ్య విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 36, ఇంజినీరింగు విభాగమునకు 19, డిడిహెచ్ విభాగమునకు 01 కలిపి మొత్తంగా 79 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధి పతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు జోనల్ స్థాయి అధికారులు వెంటనే పరిశీలిస్తూ, సంబం ధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరి ష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి జోనల్ కమీషనర్లను, అధికారులను అదరపు కమిషనర్లు ఆదేశించారు. పురమిత్ర, PGRSలో నమోదైన పిర్యాదులను కూడా అధికంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిశీలించాలన్నారు. జోనల్ కమీషనర్ లు, జోనల్ అధికారులు నిత్యం మధ్యాహ్నం 3 నుండి 5 వరకు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన ఇంజనీర్ పి.వి.వి.సత్యనారాయణ రాజు, డి సి ఆర్ ఎస్.శ్రీనివాసరావు, సీసీపీ ఏ.ప్రభాకరరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు సి డి) బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ ఎకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, పర్యవేక్షక ఇంజనీర్లు, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్, యుసిడి పి.ఒ – పి.ప్రసన్న వాణి, డిపిఒ లు జి.నాగార్జునరావు, శాంత కుమారి, డిసిపి లు, ఎసిపి లు, బయాలజిస్ట్ సాంబమూర్తి, స్టాటిస్టికల్ అధికారి పి డి వి ప్రసాద్, డిడిహెచ్ వాసుకి, ఎకౌంట్స్ ఆఫీసర్ నారాయణరావు అన్ని విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# జోన్ల నుంచి పిజిఆర్ఎస్ నిర్వహణకు అనకాపల్లి నుంచి శ్రీకారం.

**– జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్) :** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో నేరుగా తెలుసుకొని సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో జీవీఎంసీ జోన్ల నుంచి PGRS-ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణకు కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం అనకాపల్లి జోన్ నుంచి శ్రీకారం చుట్టారు. ఇకపై ప్రతి సోమవారం జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో ఏదో ఒక జోన్‌లో స్వయంగా PGRS నిర్వహించి, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానని తెలిపారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి, విభాగాధికారులతో కలిసి నిర్వహించిన PGRSలో ప్రజల నుంచి మొత్తం 11 అర్జీలు స్వీకరించి అర్జీదారులతో కమిషనర్ మాట్లాడారు. వాటిలో టౌన్ ప్లానింగ్--4, ఇంజనీరింగ్--3, రెవెన్యూ--2, పబ్లిక్ హెల్త్--1, UCD--1 అర్జీలు ఉన్నాయి. రెవెన్యూ పన్నులు, ఆక్రమణలు, నీటి సరఫరా, హౌస్ పట్టాలు, కారుణ్య నియామకాలు, జలవనరుల్లో పూడికతీత తదితర సమస్యలను అర్జీదారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గతవారం PGRSలో అందిన అర్జీల పరిష్కార పురోగతిని కూడా సమీక్షించి, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వచ్చే ఏడాదితో అనకాపల్లి మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో, జీవీఎంసీలో ప్రధాన జోన్‌గా ఉన్న అనకాపల్లి అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు ?115 కోట్లతో అగనంపూడి నుంచి అనకాపల్లికి నీటి సరఫరా పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ అందించే దిశగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (STP) ఏర్పాటుకు చర్యలు చేపడతా మన్నారు. అనకాపల్లిలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారంతో పాటు పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు అవసరమైన కార్మికులు, వ్యర్థాల తరలింపు వాహనాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాధికారులు వారంలో రెండు రోజులు అనకాపల్లిలో అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న PGRSలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న కమిషనర్, ప్రభుత్వం సూచించిన PGRS Audit మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారి అర్జీదారుతో నేరుగా మాట్లాడి, అవసరమైన చోట క్షేత్రస్థాయి పరిశీలన చేసిన అనంతరం సమస్య పరిష్కారానికి సంబంధించిన ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

సంబంధిత అధికారి లాగిన్ ద్వారానే గ్రీవెన్స్ పరిష్కార ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఒకే సమస్యపై పునరావృత ఫిర్యాదులు రాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని,

PGRS నిర్వహణ సమయంలో జోనల్ కమిషనర్లు, సంబంధిత విభాగాధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com